జనం మదిలో జగనన్న పాలన

- సేవా కార్యశూరులుగా వలంటీర్లు
- గడప గడపకూ ప్రభుత్వ పథకాలు
- 35 శాఖలకు చెందిన 537 సేవలు


కాకినాడ రూరల్ మండలం నేమాం జగనన్న కాలనీలోని గ్రామసచివాలయం

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటికే ప్రభుత్వ పాలన తెచ్చింది. పింఛన్ కావాలన్నా, రేషన్‌కార్డు కోరినా, ఇంటి స్థలానికి, ఇంటి నిర్మాణానికి, ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా లబ్ధిదారుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన శ్రమ తప్పింది. వలంటీర్ స్వయంగా వచ్చినపుడు వారికి సమస్య చెప్తే కావలసిన దరఖాస్తులు, జతపరచాల్సిన ధ్రువపత్రాలు తీసుకువెళ్లి వారే కావలసిన పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

కాకినాడ సిటీలో 50 డివిజన్లలో 101 వార్డు సచివాలయాలు ఉన్నాయి. రూరల్ మండలంలోని 43 గ్రామపంచాయతీల్లో 63 వార్డు సచివాలయాలు ఏర్పడ్డాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 537 సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఏ అర్జీ పెట్టుకున్నా 72 గంటల్లోనే సమస్యను పరిష్కరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు వచ్చిన తర్వాత స్థానిక పాలనలో వేగం, పారదర్శకత, కచ్చితత్వం పెరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి తలుపులు తట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే తప్ప మరెక్కడా లేదు.

వలంటీర్లే ప్రజల సేవకుల్లా

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు. ఎలాంటి అవినీతికి తావులేకుండా కుల, మత, వర్గ, వర్ణ, లింగ, రాజకీయ వివక్ష లేకుండా ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో సేవలు అందిస్తున్న సేవా సైన్యం ఎండైనా, చలైనా, వానైనా, వరదైనా, చివరికి కరోనా వంటి మహమ్మారి కబళించినా వెనుదిరగక, వెన్ను చూపక ప్రజాసేవే పరమావధిగా సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రధాన భూమికగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటికి వచ్చి, సంక్షేమ పథకాల గురించి వివరించి, లబ్ధిదారులతో దగ్గరుండి దరఖాస్తు చేయించి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న వలంటీర్లు, వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సేవలను ఎన్నటికీ మర్చిపోలేని విధంగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి క్షణం తపిస్తూ ప్రభుత్వ పథకాలను నిర్విరామంగా అందిస్తూ, అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తున్న సంక్షేమ సేవాజ్యోతులుగా గ్రామ, వార్డు సచివాలయాలు నిరుపమాన సేవలు అందిస్తున్నాయి.


సచివాలయ వ్యవస్థ ప్రారంభ సూచకంగా 2019 అక్టోబర్ 2న కరపలో పైలాన్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఈఆర్‌ఓ వెంకటరావు

కాకినాడ సిటీ: నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదివారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత జేఎన్‌టీయూకే ఆవరణలో ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం మెక్లారిన్ గ్రౌండ్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కూడా పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలోను, ప్రజలకు, ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అవాంతరాలు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఈఆర్వో వెంకటరావు ఆదేశించారు. ఆయన వెంట ఏఈఆర్వో, తహసీల్దార్ చల్లన్‌దొర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బీవీ మురళీకృష్ణ, నగరపాలక సంస్థ ఏఈ ఎం రమేష్ బాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీప్రసన్న, సర్వేయర్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరీష్‌కు ఎమ్మెల్యే అభినందన

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి గిరీష్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబును గిరీష్ కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరీష్‌ను శాలువాతో సత్కరించిన పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి, అరిపిరాల నాగు, నల్ల రాణి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గిరీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


సర్పవరం ఆలయం ప్రాంగణంలో పాలు పొంగించి సూర్య నమస్కారాలు చేసుకుంటున్న భక్తులు

నమో భావనారాయణా..

- సర్పవరం తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘమాసం రెండో ఆదివారం ఆలయం వద్ద తిరునాళ్ల ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ఆవు పిడకలపై పాలు పొంగించి పొంగలి తయారు చేసి ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించారు. సూర్య నమస్కారాలతో ఆలయ ప్రాంగణంలో భక్తులు నిండిపోయారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమశంకరరావు, దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, చక్రధర్ తదితరులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చూశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందించారు.


ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు


సర్పవరంలో తిరునాళ్లకు వచ్చిన భక్తులకు అన్నదానం

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి


క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

- ఎంఎస్ఎన్ చారిటీస్ క్రీడా సంబరాల్లో చైర్మన్ మల్లాడి కార్తిక్ నాయకర్

కాకినాడ సిటీ: మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో ఆదివారం పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు పరుగు పందెం, కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్, కేరమ్స్, చెస్, షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం ఆంధ్రా పాలిటెక్నిక్, ఎంఎస్ఎన్ చారిటీస్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహించారు. చైర్మన్ ఎలెవన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించారు. అత్యంత ఆసక్తికంగా, ఉత్సాహంగా ఈ క్రికెట్ పోటీ జరిగింది. 43 పరుగులు చేసిన చైర్మన్ మల్లాడి కార్తిక్‌నాయకర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ఈ క్రీడలను ఫిజికల్ డైరెక్టర్లు జె వెంకటేష్, వి.గోవింద్‌లు నిర్వహించారు. చైర్మన్ కార్తీక్‌నాయకర్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి క్రీడలు సహకరిస్తాయన్నారు. అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఆర్ వీ చందన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వాన్ని, నైతిక విలువలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.అమరేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.రాజశేఖర్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.గంగాధరరావు, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, కె.సాయికృష్ణ, హెచ్ వంశీ, వి.రాంబాబు, చంద్రమౌళి, ఎ.సుబ్బిరెడ్డి, జి.శ్రీనివాస్ రామకృష్ణ, శ్రీమన్నారాయణ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

బాలాజీ చెరువు: బీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శి అద్దంకి వెంకన్న బాబు అన్నారు. కాకినాడ జిల్లా సంఘం సమావేశం ఆదివారం స్థానిక భానుగుడి సెంటర్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అలాగే ప్రతి నెలలో పదవీ విరమణ చేసిన బీసీ ఉద్యోగులను ఆ మరుసటి నెలలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించనున్నట్టు తెలిపారు. సామర్లకోట ఎంఈఓ యాండ్ర శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలలో పదవీ విరమణ చేసిన బీసీ ఉద్యోగులను సత్కరించడం మంచి పరిణామం అని సంఘ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కాకినాడ సాలిపేట బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని యండమూరి పద్మజారాణి, సామర్లకోట మండలం మాధవపట్నం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు ముంజు త్రిమూర్తులు, జిల్లా కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్థిక కార్యదర్శి సిద్ది వెంకటేశ్వరరావు, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షులు సీహెచ్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.


ఉద్యోగులను సత్కరిస్తున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

ముగిసిన చెకుముకి సంబరాలు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం అన్నమ్మ గాటీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం ముగిసాయి. ఈ సంబరాల్లో జిల్లాలోని 20 మండలాల నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన మండల జట్లు, ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాలుగా 40 జట్లుగా పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు రాతపరీక్ష, రాపిడ్ ఫైర్, ఆడియో, వీడియో రౌండ్ అనే మూడు రౌండ్‌లుగా పాల్గొన్నారు. మూడు రౌండ్లు కలిపి ఎక్కువ మార్కులు సాధించిన వారిని విజేతలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కేఎంఎం ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తుందన్నారు. ముఖ్య అతిథి చీఫ్ ఆపరేటింగ్ అధికారి మెర్ల మురళీధర్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చాలంటే యువత వల్లనే సాధ్యమన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి క్రమశిక్షణ సామాజిక అవగాహన పెంపొందించడం ద్వారా తయారు చేసుకోవాలని అటువంటి కృషిని జన విజ్ఞాన వేదిన చేస్తుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలకు నిర్వాహకులు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు జి ప్రభాకర్‌వర్మ, వి శ్రీరామారావు, బుద్ధా శ్రీనివాస్, ఎన్.సూర్యనారాయణ, ఎస్.కన్నబాబు, ఎన్.శ్రీను, యుఎస్ఎన్ రెడ్డి, టీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న నాయకులు

ఆశాజనకంగా రామాఫలాల దిగుబడి

కాకినాడ సిటీ: రామఫలాల సీజన్ ఆరంభ మైంది. ఏజెన్సీ ప్రాంతాల తరువాత మైదాన ప్రాంతంలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలానికి చెందిన గొర్రిపూడి, అడివిపూడి, తాళ్లరేవు మండలానికి చెందిన జి వేమవరం, చొల్లంగిపేట ప్రాంతాల్లో ఎక్కువగా ఈ రామఫలాలు దొరకుతాయి. వీటిని గొర్రిపూడి నుంచి పెనుగుదురు వరకు, పెనుగుదురు నుంచి కరప వెళ్లే రహదారిలోను, తాళ్లరేవు–యానం ప్రధాన రహదారుల్లో రైతులు రోడ్ల పక్కన వీటిని విక్రయిస్తున్నారు. రైతులు వీటిని నాలుగు లేదా ఐదుగా పోగులుగా పెట్టి ఒక్కొక్క పోగు రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారం వరకు రామాఫలాల సీజన్ ఉంటుందని విక్రయదారులు చెబుతున్నారు. కాకినాడ ప్రధాన మార్కెట్‌లోనూ, కొన్ని ప్రాంతాల్లోని వారపు సంతల్లోను వీటిని విక్రయిస్తారు. కొందరు వ్యాపారులు జి.వేమవరం, గొర్రిపూడి ప్రాంతాల్లోని తోటల్లోకి వెళ్లి రామాఫలాలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అధిక రేట్లకు విక్రయిస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. పెట్టుబడి లేకుండా రామఫలాలతో మంచి ఆదాయం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గొర్రిపూడి-పెనుగుదురు రహదారిలో రోడ్డు పక్కన పోగులు పెట్టి విక్రయిస్తున్న రామఫలాలు

ఎంపీగా సునీల్‌ను గెలిపించుకుంటాం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక


జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించుకుని ఢిల్లీ పార్లమెంట్‌కు పంపుతామని ఆ పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. తన నివాసంలో ఆదివారం పారిశ్రామికవేత్త సునీల్‌ను ఎంపీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ అధిష్టానం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. యువత సునీల్ కోసం పనిచేయాలన్నారు. ఆయన విజయం సాధించడంతో పరిశ్రమలు తీసుకురావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లా ఏడు నియోజవర్గాలలో పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని, సీఎంగా మళ్లీ జగన్‌ను గెలిపించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ వంగా గీత


బోనాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

- కాకినాడ ఎంపీ వంగా గీత
- చేబ్రోలులో కనకదుర్గమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందుతున్న గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయం వద్ద విద్యుత్, మంచినీటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వందలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమాలు చేశారు. తాటికొండ పవన్ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించగా, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, జనసేన నాయకుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పలువురు నేతలు పాల్గొన్నారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

చొల్లంగి భూములను స్థానికులకే ఇవ్వాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి గ్రామంలోని 47–3 సర్వే నెంబరులోని భూములను స్థానిక లబ్ధిదారులకే కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామంలో ఉన్న స్థలాలను వేరే ప్రాంతంవారికి కేటాయించడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగి గ్రామ పంచాయతీలో అనేక మంది లబ్ధిదారులు ఉన్నారని వారికి పటవల, జి.వేమవరంలో స్థలాలు ఇచ్చి చొల్లంగిలో స్థానికంగా ఉన్న భూములను మాత్రం కాకినాడ రూరల్ మండలం ఉప్పలంక వాసులకు కేటాయించడం దారుణమన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చొల్లంగిలో భూములను స్థానిక లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో కొలువైన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్లను వధూవరులుగా చేసి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 24వ తేదీ వరకు ఈ కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 20వ తేది భీష్మ ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పాలతో 108 మంది భక్తులచే పూజలు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, అనంతరం శేషవాహనంపై ఉత్సవ మూర్తుల ఊరేగింపు, రాత్రి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు, నున్న రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించనున్నారు. 21న సింహ వాహన సేవ, 22న గరుడ వాహన సేవ, 23న హనుమద్వాహన సేవ, 24 ఉదయం లక్ష గోవింద నామ గానమృతం, చక్రస్నానం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం గజ వాహన సేవ, రాత్రి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 21వ నుంచి 24వ తేదీ వరకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేయనున్నారు. ప్రతి మండలంలో భజన మండళ్లు ఏర్పాటు చేసినట్టు నాగేశ్వరరావు తెలిపారు.


వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

గొల్లప్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో ఉన్న వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇటీవల గొల్లపల్లి చిన్నకొండ దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పందిరి రాటతో ఉత్సవాల పనులు ప్రారంభించారు. ఈ నెల 19 నుంచి 24 వరకూ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు తెలిపారు. ఈ నెల 20న స్వామి వారి దివ్య కల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

క్లుప్తంగా

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

బోట్‌క్లబ్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదివారం తెలిపారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను నగర పాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 10.30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం


సతీష్‌కు పార్టీ కండువా కప్పిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకువస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతోగానో చేరువవుతున్నాయని ఆ పథకాలే బీజేపీని గెలిపిస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మ అన్నారు. స్థానిక రెండో డివిజన్‌లో ఆదివారం బీజేపీ జిల్లా మీడియా ప్రతినిధి తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో తోలుం సతీష్‌తో పాటు 20 మంది బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా భావానీప్రసాద్, చోడిశెట్టి రమేష్‌బాబు, పైడా రవీంద్ర, గూటూరు పద్మ పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

తాళ్లరేవు: స్థానిక బైపాస్ రహదారిలో పునర్నిర్మించిన శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామివారికి ఉదయం 5.30 గంటల నుంచి పంచామృతాభిషేకం, మండపారాధన, శ్రీలక్ష్మీగణపతి హోమం, స్వామివారి గ్రామోత్సవం, సాయంత్రం స్వామివారి పడిపూజ, అనంతరం పుష్పాభిషేకం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆయా పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చురుగ్గా రిజిస్ట్రేషన్లు


సామర్లకోటలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ జె.రామారావు ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఆదివారం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించారు. దీనిలో భాగంగా ఆదివారం పలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో 5200 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా ఆదివారం నాటికి 3,700 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్టు కమిషనర్ తెలిపారు.

కాండ్రకోటలో కొనసాగుతున్న చండీహోమం


నూకాలమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న చండీహోమం

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో వినిపిస్తున్న వదంతుల నేపథ్యంలో వారం రోజులుగా నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చేపట్టిన పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ పండితులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహా చండీహోమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల శ్రేయస్సు కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. పూజలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి దుష్ట శక్తుల ప్రభావం కనిపించ లేదని, సిద్ధాంతుల సూచనల మేరకు జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.